ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.20 (309.6546)	37,882	47,650
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.07)	1,935.29	385.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.67 (45.25)	16,000	15,600

చికెన్ ధరలు	లైవ్ : రూ.108	డ్రెస్ : రూ.180	స్కిన్‌లెస్ : రూ.200


వలిగొండ మండలం సంగెం-భీమలింగం కత్వ వద్ద పరవళ్లు తొక్కుతున్న మూసీ

మూసీ పరవళ్లు


- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం

యాదాద్రి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌తోపాటు నగర శివారులో కురుస్తున్న వర్షాలకు మూసీకి వరద నీరు పెరిగింది. దీంతో జిల్లాలో మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం వద్ద గల భీమలింగకత్వ, బీబీనగర్ మండలం రుద్రవెల్లి బ్రిడ్జి వద్ద అధిక ప్రవాహంతో వరద నీరు తరలివస్తోంది. మరో నాలుగురోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. భారీవర్షాలు కురుస్తుండటంతో మూసీ పరివాహక ప్రాంతాలను కలెక్టర్ హనుమంతు కే.జెండగే బుధవారం పరిశీలించారు. వరద ప్రవహం అధికంగా ఉంటే ఆయా వంతెనలపై రాకపోకలు నిలిపివేసి, బారీకేడ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 24గంటలపాటు వరద ప్రవాహాన్ని పరిశీలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో కురుస్తున్న వాన

జిల్లాలో బుధవారం పలుచోట్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు, మరికొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో బుధవారం సగటున 1.87సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి మండలంలో అత్యధికంగా 7.58 సెం.మీలు, అత్యల్పంగా మోత్కురులో 1.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని ఆరుతడి పంటలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. పత్తితోపాటు జొన్న, ఇతర పంటలు ఏపుగా పెరిగేందుకు అవకాశం ఉంది. భారీ వర్షాలు కురిసినట్లయితే చెరువులు, కుంటలు కూడా నిండుతాయి. వాతావరణశాఖ మరో నాలుగురోజుల పాటు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ బోరుబావులపై ఆధారపడిన రైతులకు భూగర్భజలాలు పెరుగుతుండటంతో ఊరట లభించనుంది.

రైతు రుణమాఫీపై రగడ



- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల సవాళ్లకు వేదికగా గుట్ట
- దేవుళ్ల మీద ఒట్టేసి మాటతప్పిన సీఎం అంటూ ధర్నాకు బీఆర్‌ఎస్ పిలుపు
- నేడు యాదగిరీశుడికి పూజలు నిర్వహించనున్న హరీ‌ష్‌రావు
- అనంతరం ఆలేరులో ధర్నా

రుణమాఫీ పూర్తి చేశామంటున్న ముఖ్యమంత్రి.. లేదు కాలేదంటున్న బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్‌రావు. ఎవరి వాదనలు ఎటున్నా.. వీరి వ్యాఖ్యలకు జిల్లా రాజకీయ కేంద్ర బిందువుగా మారింది. సీఎం మాటతప్పారని హరీష్‌రావు నేడు ఆలేరులో ఆందోళనలో పాల్గొననున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

రైతుల రుణమాఫీ అంశం అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సవాళ్లు... ప్రతివాళ్లకు వేదికైంది. రుణమాఫీపై యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధి వేదికగా బీఆర్ఎస్ రాజకీయ తెరలేపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ రూ.2లక్షల వరకు చేశామని ప్రభుత్వం ప్రకటించగా, దేవుళ్ల మీద ఒట్టేసి అరకొరగా రైతులకు రుణమాఫీ చేశారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దేవుళ్ల మీద ఒట్టేసి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసేందుకు గురువారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మాజీమంత్రి హరీష్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలతో కలిసి స్వామివారికి పూజలు నిర్వహించి... ఆలేరులో ధర్నాకు దిగుతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ సవాళ్లతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ సీనియర్‌నేత హరీష్‌రావు చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేసేందుకు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని నలుమూలలనుంచి పార్టీ శ్రేణులను ధర్నాలో పాల్గొనేలా సన్నాహాలు చేస్తున్నారు. రైతులందరి తరఫున ఈ ప్రభుత్వాన్ని నిలదీద్దామని, పార్టీ చేపట్టే నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిస్తున్నారు. ఉదయం 9గంటలకు స్వామివారిని దర్శించుకున్న అనంతరం, ధర్నాకు ఆలేరుకు వెళ్తారు.

భువనగిరి వేదికగా సీఎం హామీ

రైతులకు రూ.2లక్షలవరకు రుణమాఫీ చేస్తానని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ విస్తృత ప్రచారం చేపట్టింది. అయితే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రుణమాఫీ చేస్తామని మాట తప్పిందని, ఓట్లు దండుకునేందుకు రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ విమర్శించింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 21న భువనగిరి అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన సభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా చెబుతున్నా... ఏదీ ఏమైనా సరే పంద్రాగస్టు నాడు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం' అని ప్రకటించారు. రైతులు వివిధ బ్యాంకుల్లో తీసుకున్న పంటరుణాలు మాఫీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో రైతుల కోసం పంట రుణమాఫీ-2024 పథకాన్ని అమలు చేస్తోంది. మొదటి విడతలో రూ.లక్షలోపు, రెండోవిడతలో రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు, మూడో విడతలో రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మాట తప్పిన ప్రభుత్వం: హరీష్‌రావు



ఆగస్టు 15లోగా రైతులందరీ రుణాలు మాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టేసి మాట తప్పారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. మొదట రుణమాఫీ మొత్తం రూ.49వేల కోట్లు అని, కేబినెట్‌లో రూ.31వేల కోట్లు అని, బడ్జెట్ కేటాయింపుల్లో రూ.26వేల కోట్లకు కుదించారన్నారు. రుణమాఫీ చేశామని సీఎం చెబుతుంటే, మంత్రులు కాలేదంటున్నారు. ఎవరి మాట నిజమో తెలియక రైతులు ఆందోళకు గురవుతున్నారన్నారు. దేవుళ్ల మీద ఒట్టేసి మాట తప్పిన సీఎంను నిలదీసేందుకు స్వామివారికి పూజలు నిర్వహించి, ఆలేరులో ధర్నా నిర్వహిస్తామన్నారు.

పోలీస్ బందోబస్తు నడుమ భూసేకరణ

- త్రిపుల్ ఆర్ ఇంటర్ ఛేంజ్ జంక్షన్‌కు సర్వే ప్రారంభం
- మూడు బృందాలుగా సర్వే


చౌటుప్పల్‌లో పోలీస్ బందోబస్తు నడుమ భూసేకరణ సర్వే చేస్తున్న సర్వేయర్లు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 21: చౌటుప్పల్ పట్టణంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేయనున్న రీజనల్‌రింగ్ రోడ్డు ఇంటర్‌ఛేంజ్ జంక్షన్ ఏర్పాటుకు భూసేకరణ సర్వే బుధవారం ప్రారంభమైంది. 10మంది పోలీసు బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, ఎన్‌హెచ్‌ఏఐ నియమించిన సర్వే ఏజెన్సీ బృందాలు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఇంటర్‌చేంజ్ జంక్షన్‌కు మార్కింగ్ చేశాయి. చౌటుప్పల్ తహసీల్దార్ ఎస్.హరికృష్ణ ఆధ్వర్యంలో సర్వే అధికారులు, సిబ్బంది మూడు బృందాలుగా విడిపోయి మార్కింగ్‌చేసి జెండాలను పాతించారు. జెండాలను పాతిన ప్రాంతాలను మళ్లీ గుర్తించేందుకు పెగ్ మార్కింగ్ చేశారు. బార్డర్‌లో పాతిన జెండాలను ఎవరైనా తొలగిస్తే.. మార్కింగ్ చేసిన ప్రాంతాన్ని గుర్తించేందుకు సర్వే మిషన్లలో చేసిన పెగ్ మార్కింగ్ ఉపయోగపడుతుంది. ఈ సిస్టమ్‌లో మార్కింగ్ చేసిన ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించేందుకు వీలు కలుగుతుంది. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని చౌటుప్పల్, లింగోజీగూడెం, తాళ్లసింగారం, తంగడపల్లి రెవెన్యూ గ్రామాలకు చెందిన 191 ఎకరాల భూములను సర్వేచేశారు. చౌటుప్పల్ పట్టణంలోని మొత్తం 34 సర్వే నెంబర్లలో 163 ఎకరాలు, తంగడపల్లిలోని ఆరు సర్వే నెంబర్లలో 17 ఎకరాలు, తాళ్లసింగారంలోని నాలుగు సర్వే నెంబర్లలో 11 ఎకరాలు, లింగోజీగూడెంలోని రెండు సర్వే నెంబర్లలో మూడు ఎకరాల భూములను సర్వేచేసి ఇంటర్‌చేంజ్ జంక్షన్‌కోసం హద్దులను గుర్తించారు.

మూడు సర్వే బృందాలు

చౌటుప్పల్ మండల సర్వేయర్ డి.మురళీధరన్, భూదాన్‌పోచంపల్లి సర్వేయర్ సాయి, సంస్థాన్‌నారాయణపురం మండల సర్వేయర్ శంకరాచారి ఆధ్వర్యంలో మూడు బృందాలుగా విడిపోయి సర్వేచేసి మార్కింగ్ చేశారు.

మార్కెట్ విలువ ప్రకారంగా ధర చెల్లించాలి

త్రిపుల్ ఆర్‌లో కోల్పోతున్న ఆస్తులకు మార్కెట్ విలువ ప్రకారం ధర చెల్లించాలని చౌటుప్పల్ తహసీల్దార్ హరికృష్ణను బాధితులు కోరారు. చౌటుప్పల్‌లో సర్వే నిర్వహిస్తున్న ప్రాంతంలో బాధితులు ఆయన్ను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. అప్పులు చేసి ప్లాట్లు కొనుగోలు చేశామని, అన్యాయం జరగకుండా చూడాలని వారు తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ అందేలా కృషి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం, ఆగస్టు 21: వివిధ సాంకేతిక కారణాలతో పలువురి రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో రాలేదని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని, సంఘంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడిజిల్లావ్యాప్తంగా సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న 89వేల మంది రైతులకు రూ.500కోట్ల రుణమాఫీ రావాల్సి ఉండగా 52,708 మందికి రూ.280కోట్లు రుణమాఫీ అయిందన్నారు. పలు సాంకేతిక కారణాలతో అర్హులైన కొంతమంది రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో రాలేదన్నారు. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వర్తింపజేసేందుకు ప్రభుత్వం గ్రామాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించిందన్నారు. త్వరలో రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు ఇచ్చే పంట రుణాలు రూ.లక్ష నుంచి రూ.1.50లక్షలకు పెంచినట్లు తెలిపారు. పాస్ పుస్తకాలు లేకుండా, మార్టిగేజ్ చేయకుండా రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్ఎల్ఎం పథకం కింద ఇచ్చే 50శాతం సబ్సిడీ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు వ్యాపారులకు సబ్సిడీ కింద, పీఎంఈజీపీ పథకం కింద రుణాలు ఇస్తున్నామన్నారు. స్వయం ఉపాధికోసం యువతకు సీజీటీఎం పథకం కింద రూ.2కోట్ల వరకు రుణాలు ఇస్తున్నామన్నారు. గ్రామీణ రైతులకు రూ.25 లక్షలనుంచి రూ.30లక్షల వరకు ఇంటి రుణాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రైతు పిల్లల ఉన్నత చదువుల కోసం ఎకరానికి రూ.5లక్షలనుంచి రూ.30 లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. లాభాల బాటలో నడిపిస్తున్న సంస్థాన్‌నారాయణపురం, గుజ్జ ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు, పాలకమండలి సిబ్బందిని శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. సహకార సంఘాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సమావేశంలో సంస్థాన్‌నారాయణపురం పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, గుజ్జ పీఏసీఎస్ చైర్మన్ దోడ యాదిరెడ్డి,డైరెక్టర్లు బొడ్డుపల్లి గాలయ్య, జంగయ్య, గడ్డం పెంటయ్య, నాయకులు జక్కిడి బాల్‌రెడ్డి, మందుగల బాలకృష్ణ, సతీష్, నరసింహ, రమేష్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయమే మేలు

సంస్థాన్‌నారాయణపురం ఆగస్టు 21: రానున్న రోజుల్లో సేంద్రియ వ్యవసాయమే మేలు అని ఐఎల్‌టీ ఫౌండేషన్ డైరెక్టర్ జార్జ్, మదర్‌థెరిస్సా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు జూలియల్ పోలిశెట్టి అన్నారు. సంస్థాన్‌నారాయణపురం ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ, మదర్ థెరిసా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ భవన నిర్మాణ పనులను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పంటల సాగు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి ఆరోగ్యం కోసం ప్రతీ రైతు సేంద్రియ పద్ధతులను అవలంబించాలన్నారు. ఈ సందర్భంగా జార్జ్‌ను రైతులు సన్మానించారు. సమావేశంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీఈవో దేవరకొండ బాబు, చైర్మన్ పల్లె పుష్పారెడ్డి, కార్యదర్శి జక్కిడి మేఘారెడ్డి, బోర్డు డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో నీటి సంరక్షణకు చర్యలు

- వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ హనుమంతు కే.జెండగే


సంగెం-భీమలింగం కత్వ వద్ద ఉన్న కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్

యాదాద్రి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల సమన్వయంతో నీటి సంరక్షణ పనులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ కార్యదర్శి సౌరభ్‌సింగ్, ఉపేంద్ర ధోండే బృందం జిల్లాలో ఈ నెల 23 వరకు పర్యటించనుంది. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌ను సందర్శించి, జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు, పురోగతిపై వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం, అటవీ, వ్యవసాయం, భూగర్భజలాలు, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, తదితర శాఖల ద్వారా చేపట్టిన నీటి సంరక్షణ పనులను కలెక్టర్ జెండగే పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బృందానికి వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీవో నాగిరెడ్డి, డీఎఫ్‌వో పద్మజారాణి, సీపీఎం వెంకటేశ్వర్లు, ఉద్యానవన అధికారి సుభాషిణి, భూగర్భజల శాఖ డీడీ జ్యోతికుమార్, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్, పశుసంవర్ధక శాఖ అధికారి కృష్ణ, నీటిపారుదల శాఖ అధికారి నర్సింహ పాల్గొన్నారు.

వలిగొండ: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతు కే. జెండగే సూచించారు. బుధవారం మండలంలోని సంగెం గ్రామ పరిధిలో భీమలింగం కత్వ వద్ద ఉన్న కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురిసినప్పుడు మూసీ నది ఉప్పొంగే అవకాశం ఉందని, ఆ మూసీ పరివాహక ప్రజలు రాకపోకలకు ఈమార్గం గుండా వెళ్లవద్దని సూచించారు. అధికారులు బారీకేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను అనుమతించ వద్దని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులను మూసీ నదిలోకి చేపల వేటకు వెళ్లకుండా చూడలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

నేడు భువనగిరికి చిన్నారెడ్డి రాక



భువనగిరి రూరల్, ఆగస్టు 21: రాజబహదూర్ కొత్వాల్ వెంకటరామారెడ్డి 150వ జయంతిని పురస్కరించుకుని స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరవుతున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గంట జలేందర్‌రెడ్డి తెలిపారు. భువనగిరి మండలం పెంచికల్‌పహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని రామకిష్టాపురంలోని అమేయ కృషి వికాస కేంద్రంలో గురువారం ఉదయం 11గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అమేయ కృషి వికాస కేంద్రం వ్యవస్థాపకుడు, పురస్కార గ్రహీతలు జిట్టా బాల్‌రెడ్డి, జ్యోతిరెడ్డి దంపతులు, ఆత్మీయ భారతీ అధ్యక్షుడు వాకిటి రాంరెడ్డి పాల్గొంటారన్నారు.

'ఉపాధి' పనులతో భూగర్భజలాలు పెంచాలి

- కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ సౌరభ్‌సింగ్


ముత్తిరెడ్డిగూడెంలో కందకాన్ని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకుంటున్న బృందం సభ్యులు

భువనగిరి రూరల్, ఆగస్టు 21: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా భూగర్భజలాలు, హరితహారం విస్తీర్ణం పెంచేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ సౌరభ్‌సింగ్ అన్నారు. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో బుధవారం సాయంత్రం జలశక్తి అభియాన్ పథకానికి సంబంధించిన పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు, మొక్కల పెంపకం తదితర పనులను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలోగల గుట్ట చుట్టూ తీసిన కందకాలను పరిశీలించారు. కాళేశ్వరం కాల్వ పక్కన ఏర్పాటు చేసిన వనాలను కూడా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని చెరువుల అభివృద్ధికి కూడా వినియోగించుకోవాలని, దీంతో భూగర్భజలాలు పెంపొందుతాయన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేంద్ర భూగర్భజల శాస్త్రవేత్త ఉపేంద్ర దొండే, డీఆర్‌డీవో టీ.నాగిరెడ్డి, అదనపు డీఆర్‌డీవో జి.సురేశ్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, ఎంపీవో ఎం దినకర్, ఏపీవో జి.బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.









చాకలిగట్టుకు దారేదీ?

● సాగర్‌లో ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు

నాగార్జునసాగర్, ఆగస్టు 21: నాగార్జునసాగర్ ఒక గొప్ప పర్యాటక ప్రాంతమే కాకుండా అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా కూడా విరాజిల్లుతుంది. దీంతో సాగర్‌కు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, బౌద్ధ మతస్థులు వస్తుంటారు. అంతేకాకుండా దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం ఉండటంతో ఎకో టూరిజం పరంగా కూడా అభివృద్ధికి సాగర్‌లో అవకాశం ఉంది. పర్యాటకంగా అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్న నాగార్జునసాగర్ పర్యాటకంపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి.

చాకలి గట్టుకు దారేది?

జలాశయం మధ్యలో 400 ఎకరాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో జింకల సంరక్షణ కేంద్రమైన చాకలిగట్టు నాగార్జునకొండకు కేవలం కిలో మీటరు దూరంలో ఉంటుంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రతీ రోజు లాంచీలు నడుపుతారు. ఈ లాంచీలను చాకలి గట్టు మీదుగా నడిపితే ఎకో టూరిజం పరంగా సాగర్ మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇలా చేస్తే సాగర్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుంది. ఏడాది క్రితం చాకలి గట్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు పరిశీలించారు. కానీ నేటి వరకు ఆ ఊసే ఎత్తలేదు. పర్యాటకశాఖకు ఇంతటి ఆదాయ వనరులు ఉన్న చాకలి గట్టును నిర్లక్ష్యం చేయడం ఏమిటని పలువురు ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ వరకు లాంచీలు నడిపే అవకాశం

సాగర్ ప్రాజెక్టుకు దిగువన 21 కిలో మీటర్ల దూరంలో టెయిల్ పాండ్ ప్రాజెక్టును నిర్మించారు. 21 కిలో మీటర్ల దూరం వరకు సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా, క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు వదిలిన నీరు నిల్వ ఉంటుంది. ఈ నీటిలో లాంచీలను నడిపితే పర్యాటకులు ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణించే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం ఈ ప్రతిపాదనలు కూడా పర్యాటకల శాఖ అధికారులు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. కానీ నేటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. సాగర్‌కు గురువారం రానున్న పర్యాటక శాఖ అధికారులు సాగర్‌లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు మెరుగు పరిచేలా అలాగే చాకలి గట్టుపైకి పర్యాటకులకు అనుమతి ఇచ్చేలా చూడాలని పర్యాటకులు కోరుతున్నారు.

నేడు చాకలి గట్టుకు పర్యాటక శాఖ అధికారులు

అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న చాకలి గట్టును గురువారం ఉదయం పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్, డైరెక్టర్ ఇలా త్రిపాఠీ, ఎండీ ఎన్.ప్రకాష్‌రెడ్డి పరిశీలించనున్నారు. వీరు చాకలి గట్టులో ఎకో టూరిజం అభివృద్ధి గురించి సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మితమైన బుద్ధవనం ప్రాజెక్టు సందర్శించి అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సౌకర్యాలను గురించి పరిశీలించనున్నారు.



నృసింహుడికి నిత్యపూజలు



ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవారలను మేల్కొపిన అర్చకులు గర్భగుడిలో కొలువదీరిన స్వయంభులను స్వర్ణ ప్రతిష్టమూర్తులను అభిషేకరించి తులసీ దళాలతో అర్చించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు పూర్తి చేశారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వర స్వామికి శైవాగమ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,87,635 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

స్వామి వారిని దర్శించిన ప్రముఖులు

స్వామి వారిని షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్‌బాద్ ఎంపీ బలరాంనాయక్ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.









పిడుగుపాటుతో గేదె మృతి

మర్రిగూడ, ఆగస్టు 21: పడిగుపాటుతో గేదె మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని కుదాభక్షపల్లి గ్రామంలో మంగళ వారం రాత్రి జరిగింది. బాధితుడు సిరగోని శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గేదె పిడుగు పడటంతో గేదె మృతి చెందిందని అని తెలిపారు. గేదె విలువ రూ. లక్ష ఉంటుందని తెలిపారు. పాలిచ్చే గేదె మృతిచెందడంతో తాను ఆర్థికంగా నష్ట పోయానని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొమ్మలు తొలగిస్తుండగా..

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 21: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం రాంపురం గ్రామంలో బుదవారం జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదవూర మండలం ఊట్లపల్లికి చెందిన ఊరడి మల్లయ్య(35) కూలీ పని చేసూత జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రాంపురం గ్రామంలో ముత్యాల మల్లయ్య అనే రైతు బత్తాయి తోటలో మొక్కలు తీయడానికి పదిమంది కూలీలతో పాటు మల్లయ్య కూడా వెళ్లాడు. మొక్కలు కోసే చేసే క్రమంలో బోర్ మోటర్‌కు ఆ బత్తాయి చెట్ల గుండా విద్యుత్ వైర్ వెళ్లింది. అది గమనించని మల్లయ్య తన వద్ద ఉన్న ఇనుప కట్టర్‌తో చెట్టను కొమ్మలు కట్ చేసే క్రమంలో విద్యుత్ వైర్‌ను కట్ చేశాడు. దీంతో కట్టర్ ద్వారా విద్యుదాఘాతంతో పడిపోయాడు. దీంతో తోటి కూలీలు వెంటనే 108 వాహనానికి ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది అతనిని పరిశీలించగా చని పోయినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. మల్లయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ప్రస్తుతం భార్య గర్భవతి. భార్య ఊరడి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

ఇద్దరు డీలర్ల లైసెన్స్ రద్దు

గుర్రంపోడు, ఆగస్టు 21: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరు డీలర్ల లైసెన్స్‌లను జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ రద్దు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి తెలిపారు. బుధవారం కొప్పోలు గ్రామంలో కలెక్టర్ నారాయణరెడ్డి పర్యటనలో రైతులకు అధిక ధరకు యూరియా అమ్ముతున్నారని కలెక్టర్ దృష్టికి తేవడంతో స్పందించిన కలెక్టర్ విచారణ నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి నిర్వహించిన విచారణలో ట్రాన్స్‌పోర్టు చార్జీలు అధికమవుతుండడంతో సుమారు రూ.40 నుంచి రూ.50 వరకు అధిక ధరలకు అమ్ముతున్న జ్యోతిఫర్టిలైజర్స్, శివశంకర్ ఫర్టిలైజర్స్‌ల లైసెన్స్‌లు జిల్లా వ్యవసాయ అధికారి రద్దు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

ఆస్పత్రి ఆవరణలో వ్యక్తి మృతి



ఖుర్షీద్ మృతదేహం

సూర్యాపేటక్రైం, ఆగస్టు 21: అనారోగ్యంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సూర్యాపేటలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఖుర్షీద్(50) కొంత కాలంగా సూర్యాపేటలోని జేజేనగర్‌లో గల బంధువుల నివాసంలో ఉంటూ చర్చి కాంపౌండ్‌లో గల చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఏడాదిగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించింది. దీంతో చికెన్ సెంటర్‌కు వెళ్లడం మానేసి మద్యం సేవిస్తూ ఇంట్లో వెళ్లిన తర్వాత రెండు, మూడు రోజులకోమారు తిరిగి ఇంటికి వస్తున్నాడు. అందులో భాగంగానే ఈ నెల 19న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి బుధవారం వరకు ఇంటికి వెళ్లలేదు. బంధువులు పట్టణంలో వెతికినప్పటికి ఆచూకీ లభించలేదు. మృతుడు మంగళవారం రాత్రి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకుని ఆస్ప త్రి ప్రాంగణంలో నిద్రించాడు. నిద్రలోనే అనారోగ్యంతో మృతిచెందాడు. ఉదయాన్నే గమనించిన ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి కుమారుడు బాసిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

హుజూర్‌నగర్, ఆగస్టు 21: వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరు విటులు, గృహ నిర్వాహకురాలను పట్టుకున్నారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో బుధవారం జరిగింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం... హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపీపీ కాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సాయంత్రం ఐదు గంటల సమయంలో సమాచారం రావడంతో తన సిబ్బందితో వ్యభిచార గృహంపై దాడి చేసి అక్కడ ఇద్దరు విటులు, నిర్వాహకురాలను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారివద్ద నుంచి రూ.1700, ఐదు సెల్‌ఫోన్‌లు, మూడు బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఏషియన్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



శశాంక్ వనమాల

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 21: నల్లగొండ మిర్యాలగూడ పట్టణానికి క్రీడాకారుడు శశాంక్ వనమాల ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రాణిస్తున్నాడు. చైనాలో జరుగుతున్న టోర్నమెంట్‌లో అండర్-15 విభాగంలో తొలి రౌండ్‌లో హాంకాంగ్ క్రీడాకారుడు ఛాన్‌ఇక్‌హ్యాపై విజయం సాధించిన శశాంక్ మంగళవారం జరిగిన మలి రౌండ్‌లోనూ సత్తా చాటాడు. మలేషియా ఆటగాడు ఖైరుల్ అజ్లాన్‌ను ఓడించి ప్రీ క్వార్టర్స్‌కు చేరాడు. ప్రీక్వార్టర్స్‌లో చైనా క్రీడాకారునితో తలపడనున్నాడు.

ఇన్నోవేషన్ అవార్డు అందుకున్న సుమన్



అవార్డు అందుకుంటున్న సుమన్ భొక్రే

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 21: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సుమన్ బొక్రే ఇన్నోవేషన్ అవార్డు అందుకున్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాన్‌హలాల్ ఆహారం అందించేందుకు స్థాపించిన ఆర్బిట్ కిచెన్(ఓకే)కు ఇన్నోవేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో ఐక్యరాజ్య సమితి అవార్డు ప్రకటించిందన్నారు. సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌జీడీ) పేరుతో ప్రకటించిన ఈ అవార్డును హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో అందుకున్నట్లు తెలిపారు. నాన్‌హలాల్ ఆహారం అవసరమైన వారి ఆకలిని తీర్చడంతో పాటు ఆర్బిట్ కిచెన్లలో ఈక్వెల్ ఆపర్చునిటీ కింద డిసబుల్డ్ పర్సన్ల సేవలను ప్రోత్సహించిస్తున్నందుకు రెండు విభాగాల్లో అవార్డులు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఓకేలోని భాగస్వామ్యులందరి కృషితోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు.

రెండున్నర టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాలరూరల్, ఆగస్టు 21 : అక్రమంగా తరలిస్తున్న రెండున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని బుధవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి శివారులో స్పెషల్ బ్రాంచి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ధర్మా తెలిపిన వివరాల ప్రకారం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో స్పెషల్‌బ్రాంచి పోలీసులు చిన్నకాపర్తి శివారులో తనిఖీలు చేశారన్నారు. తనిఖీల్లో గ్రామశివారులో ఆటోను తనిఖీ చేయగా అందులో ఉన్నది రేషన్ బియ్యంగా గుర్తించారన్నారు. 50 బస్తాల్లో రెండున్నర టన్నుల బియ్యాన్ని తరలిస్తుండగా ఎస్ఐ తెలిపారు. ఆటోను, బియ్యాన్ని చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలు గ్రామాల్లో బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నారని వీటిని యదాద్రి-భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం కల్వకుంటతండాకు చెందిన లావుడి సు రేష్ సేకరించి అక్కడికి తరలిస్తున్నాడని, పట్టుబడిన బియ్యంను ఆటోను చిట్యా ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

నార్కట్‌పల్లి, ఆగస్టు 21:జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే జిల్లాలో కొనసాగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రజల సగటు ఆరోగ్య స్థితిగతులు, జీవన ప్రమాణాలను సర్వే ద్వారా అంచనా వేసి భవిషత్ కార్యాచరణకు మార్గదర్శకంగా ఉండే ఆరోగ్య ప్రణాళిక తయారీ కోసం కేంద్రం ప్రభుత్వం ప్రతీ ఐదేళ్ల కోసారి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే సిగ్మా రీసెర్చ్ అనే సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలోని ఇప్పటికే గుర్తించిన 42గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ప్రతీ బ్యాచ్‌కు ఏడుగురు చొప్పున, ఏడు బ్యాచ్‌లుగా సర్వే నిర్వహిస్తున్నారు.

ఎండుగడ్డి పిరం

● ఇతర జిల్లాల నుంచి పశుగ్రాసం తెచ్చుకుంటున్న రైతులు
● గత ఏడాదితో పోల్చితే భారీగా పెరిగిన ధరలు
● ట్రాక్టర్ గడ్డి రూ.2500లకు కొనుగోలు చేస్తున్న రైతులు



ట్రాక్టర్‌లో వరి గడ్డి తీసుకొస్తున్న రైతు

చింతపల్లి, ఆగస్టు 21: పశుగ్రాసం కొరతతో మూగజీవాలు వేదన చెందుతున్నాయి. జీవాలను కాపాడుకునేందుకు రైతులు ఇతర జిల్లాల నుంచి రైతులు ఇతర జిల్లాల నుంచి పశుగ్రాసాన్ని అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి తెచ్చుకుంటున్నారు. పాలు ఇవ్వడానికి, వ్యవసాయం చేయడానికి పశువులకు మేలు పశుగ్రాసం అందించాలి. కానీ రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలు సాగు చేస్తుండడంతో పశుగ్రాసం దొరకడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పశుగ్రాసం ధరలు భారీగా పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. చింతపల్లి మండలంలో ఈ సంవత్సరం పశుగ్రాసానికి తీవ్రమైన కొరత ఏర్పడింది. గడ్డి దొరక్కపోవడంతో మూగ జీవాలు అల్లాడిపోతున్నాయి. దీంతో బక్కచిక్కిపోతున్న ఆవులు, గేదెలను చూసి రైతులు దిగాలు చెందుతున్నారు. ఏటా పశువులు మేతకు సరిపడా ఉంచుకొని మిగిలిన దానిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ప్రతి నెలా వరి గడ్డి, జొన్నగడ్డి సాగు చేసి గ్రాసానికి కొదవ లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకునేవారు. గత ఏడాది సరిగా వర్షాలు సరిగా లేకపోవడంతో వరి సాగు తగ్గింది. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఆకలికి అలమటిస్తున్న జీవాలను చూడలేక కొందరు రైతులు కొండబాట పడుతుంటే, మరికొందరు అధిక ధర వెచ్చించి గడ్డి కొనుగోలు చేస్తున్నారు. మరికొద్దరు పాడి పోషణను వదిలేస్తున్నారు.

చింతపల్లి మండలంలో..

చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కువ శాతం వ్యవసాయంపైనే ఆధారపడి నివసిస్తున్నారు. అనుబంధంగా పశుపోషణ చేస్తున్నారు. మండలంలో ఆవులు 9,558, గేదెలు 6,548, గొర్రెలు 38,227, మేకలు 9,885 ఉన్నాయి. గతేడాది వరకు ట్రాక్టర్ వరిగడ్డి రూ.600నుంచి 800లు పలకగా, ఈ సంవత్సరం రూ.2000 నుంచి 2500 వరకు చేరింది. మండలంలో పశుగ్రాసరం దొరకకపోవడంతో రైతులు ఇతర జిల్లాల బాట పడుతున్నారు. చింతపల్లి, వింజమూర్, ఘడియాగౌరారం, నసర్లపల్లి, గొడుకొండ్ల, పోలేపల్లి రాంనగర్, తక్కళ్లపల్లి, కుర్మేడ్, ఉమ్మాపురం, గొల్లపల్లి, చాకలిశేరుపల్లి, అంగడి కుర్మపల్లి, గ్రామాలకు చెందిన రైతులు రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహింపట్నం, మహబూబ్‌నగర్ జిల్లాలోని అమన్‌గల్, కడ్తాల్, కందూకుర్, తాడిపత్రి నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

గడ్డి కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పాడి పోషణపైనే కుటుంబాన్ని నెట్టుకొట్టుస్తున్నాం. కొరత ఉన్నా లాభాలు వస్తాయ నే అనే ఆశతో పాడి పరిశ్రమను కొనసాగిస్తున్నా. ప్రభు త్వం రాయితీపై గడ్డి విత్తనాలు సరఫరా చేసి అదుకోవాలి.

● బాదేపల్లి కృష్ణయ్య, రైతు గొడుకొండ్ల.

భారమైనా తప్పడం లేదు

నాకు మూడు గేదెలు ఉన్నాయి. గతంలో సొంత పొలంలో సాగు చేసుకోని వాటికి అవసరమైన గడ్డి సమకూర్చుకున్న. ఈ సారి బోరులో నీరు లేక సాగు చేయలేదు. గేదెలు పోషించేందుకు పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నాం. భారమైనా తప్పడం లేదు.

● కడారి సత్తయ్య, రైతు గొడుకొండ్ల.

ఆంజనేయస్వామి శోభాయాత్రలో అపశ్రుతి

● విద్యుదాఘాతంతో పలువురికి గాయాలు ● నల్లగొండ జిల్లా చందంపేట మండలం పాగిళ్లలో ఘటన

చందంపేట, ఆగస్టు 21: ఊరంతా వేడుక చేస్తుండగా చివరి ఘట్టంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రభబండికి వైద్యుత్‌వైర్ తాకి విద్యుదాఘాతానికి గురై ఎనిమిది మందికి గాయాలయ్యాయి. దీంతో కార్యక్రమాన్ని నిలిపివేశారు. బుధవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. శ్రావణ మాసం పురస్కరించుకుని మధ్యాహ్నం ఒంటిగంటకు గ్రామస్థులు ఆంజనేయస్వామి శోభాయాత్రను నిర్వహించారు. సుమారు 250మంది గ్రామస్థులు పాల్గొన్న ఈ శోభాయాత్రలో ప్రభ బండ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో ప్రభ బండి వెళ్తుండగా గ్రామంలో విద్యుత్ వైర్ తాకడంతో విద్యుదాఘాతం జరిగింది. ఆ ప్రభబండిపై కూర్చొని ప్రభను పట్టుకున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వారందరినీ ప్రైవేట్ వాహనంలో దేవరకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆరుగురికి స్వల్ప గాయాలు కాగా ఇద్దరికి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్ర గాయాలైన జటావత్ కేలి, జటావత్ లక్ష్మిలను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యుదాఘాతం ఘటనతో ఆ కార్యక్రమాన్ని ముగించిన గ్రామస్థులు ఇళ్లకు చేరుకున్నారు.



పొగిళ్ల గ్రామంలో ప్రమాదానికి కారణమైన ప్రభ

కొలనుపాకలో శాతవాహనకాలం నాటి గ్రామం

ఆలేరు రూరల్, ఆగస్టు 21: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాకవాగు ఒడ్డున శాతవాహన కాలం నాటి ప్రాచీన చారిత్రాత్మక గ్రామాన్ని గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా ఆయన కొలనుపాకలో చారిత్మక ఆధారాల కోసం పరిశోధిస్తున్నారు. ఈ సందర్భంగా ఈత్తిల వాగు ఒడ్డున పాటిగడ్డపై క్షేత్రసాయి పరిశోధన చేయగా ఈ విషయం బయట పడిందని తెలిపారు. ప్రాచీన కాలం నాటి గ్రామం వదిలి వెళ్లిన చారిత్మక ఆధారాలు లభించే చోటును తాటిగడ్డ అంటారని తెలిపారు. ఇక్కడ ఒకటో శతాబ్దం ముందు ఆ తర్వాత కాలంలో మానవ నాగరికత విల్లసిల్లింది అనడానికి అనేక చారిత్మక ఆధారాలు లభిస్తున్నాయని తెలిపారు. ఇక్కడ భౌద్ధ మత నిర్మాణాలకు ఉపయోగించే పాలరాయి ముక్క, మట్టిపూస, రాగిపూస, వివిధ రంగుల్లో ఉన్న గాజు ముక్కలు గవ్వలు గుండ్రాటి రాయి డిజైన్ చేసిన కుండ పెంకులు, రాతి పనిముట్లు లభించాయని వివరించారు. ఈ చారిత్రక్మ ఆధారాన్ని బట్టి ఇక్కడ శాతావాహన కాలంలో- 1 నుంచి మూడు శతాద్బంలో ఒక గ్రామం ఏర్పడిందని, భౌద్ధం విలసిల్లిందన్నారు. ఆలేరు బిక్కేరు వాగు వద్ద ఉందని భౌద్ధ బిక్షకులు ఇక్కడ ఉండటం వల్ల ఈ వాగుకు బిక్కేరు వాగు పేరు వచ్చిందని తెలిపారు. బిక్కేరు వాగు సమీపంలోనే కొలనుపాక గ్రామం ఉందన్నారు. వాగు నుంచి జైన ఆలయం వరకు పురవస్తు శాఖ పరిశోధిస్తే, భూగర్భంలో దాగి ఉన్న మరింత చరిత్ర బయట పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు.



కొలనుపాకలో లభించిన శతవాహన కాలంనాటి వస్తువులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వేములపల్లి, ఆగస్టు 21: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన జలగం రాములు(53) ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కొంతకాలంగా సూర్యాపేట పట్టణం అలకాపూరి కాలనీలో నివాసముంటున్నాడు. బుధవారం విధి నిర్వహణలో భాగంగా మిర్యాలగూడకు ద్విచక్ర వాహనంపై బయలుదేరి వస్తుండగా శెట్టిపాలెం గ్రామ శివారుకు చేరుకోగానే మిర్యాలగూడ నుంచి సూర్యాపేట వైపు వస్తున్న లారీ అతివేగంగా అజాగ్రత్తతో ఒక్కసారిగా ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాములు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టి కొద్ది దూరం దూసుకొని వెళ్లింది. దీంతో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకోని మృతదేహానికి పంచనామా నిర్వహించి మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం రాములు భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

రామన్నపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన తెడ్డు శేఖర్(46) రైతు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శేఖర్ ఈ నెల 19న తన వ్యవసాయ బావి వద్ద పనులు ముగించుకొని టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై ఇంటికి వస్తుండగా నిధానపల్లి క్రాస్ రోడ్డు వద్ద భువనగిరి నుంచి చిట్యాల వైపు వెళ్తున్న టీఎస్ 08 జెకె 1998 బుల్లెట్ వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన శేఖర్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

నకిరేకల్: శ్రీకాకుళం జిల్లా నుంచి బులెట్ వాహనంపై ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌కు వెళ్తుండగా నకిరేకల్ శివారులో వాహనం అదుపుతప్పి బుధవారం ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు తీవ్ర గాయాలయ్యాయి. నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా సావరకోట మండలంలోని కుమ్మరకుంట గ్రామానికి చెందిన సాదు సంతోష్(24), స్నేహితుడు సారత్ బులెట్‌బైక్‌పై వాళ్ల స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. నకిరేకల్ శివారులోని హరికృష్ణ పార్‌బాయిల్డ్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి డీ వైడర్‌ను ఢీ కొట్టారు. సంతోష్ అక్కడికక్కడే మృతిచెందగా సారత్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్సకోసం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు.

ఆత్మకూరు(ఎం): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. బోడుప్పల్‌కు చెందిన పగిడిపల్లి అబ్బయ్య, అతని భార్య సావిత్ర ద్విచక్రవాహనంపై ఆత్మకూరు (ఎం) మండలం రహీంఖాన్‌పేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా, మండల కేంద్రంలో ద్విచక్రవాహనానికి అకస్మాత్తుగా కుక్క అడ్డం వచ్చి తగలడంతో ఇరువురు పడిపోగా తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి భువనగిరి ఆసుపత్రికి తరలించారు.

అడ్వాన్స్ చెల్లించాలని వైద్యం చేయలేదు

● కొత్తపేట పారమిత ఆసుపత్రిలో బాలిక మృతి
● వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన
● హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో ఘటన



అధిర(ఫైల్)

నల్లగొండ క్రైం, ఆగస్టు 21: శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న తమ కుమార్తెకు వైద్యం చేయకుండా అడ్వాన్స్ చెల్లించాలంటూ ఆలస్యం చేయడంతో చిన్నారి మృతిచెందిందని బాధితురాలి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం హైదరాబాద్ ఎల్బీనగర్‌లో కొత్తపేట పారమిత ఆసుపత్రిలో ఈ సంఘటన జరిగింది. బాధితులు, నల్లగొండ జిల్లా కేంద్రం పానగల్‌కు చెందిన చింత అజయ్‌బాబు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పానగల్‌కు చెందిన చింత అజయ్‌బాబు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, ఆయన కుమార్తె చింత అధిర(5) కొద్ది రోజులుగా న్యుమోనియాతో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని చిన్నపిల్లలకు సంబంధించిన ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఆమెను మంగళవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కొత్తపేటలో ఉన్న పారమిత ఆసుపత్రికి తీసుకెళ్లారు. అధిరకు వెంటనే వైద్యం చేయకుండా ఓపీ నమోదు చేయించి, అడ్వాన్స్ చెల్లించాలని 40 నిమిషాల వరకు వైద్యం ప్రారంభించలేదని బాలిక కుటుంబసభ్యులు ఆరోపించారు. అప్పటికే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న అధిరకు పారమిత ఆసుపత్రి నిర్వాహకులు సరైన సమయంలో చికిత్స అందించకపోవడంతోనే మూడు గంటల సమయంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. దీంతో ఆగ్రహం చెందిన కుటుంబసభ్యులు పారమిత ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. అధిర మృతికి ఆసుపత్రి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని, ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ఆస్పత్రి వద్ద బందోబస్తు నిర్వహించారు. విషయం తెలుసుకున్న వైద్యశాఖ అధికారులు ఆసుపత్రికి వచ్చారు. చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. పానగల్‌లోని స్మశాన వాటికలో బుధవారం అధిర అంత్యక్రియలు నిర్వహించారు.

అసోం వాసి అదృశ్యం.. కేసు నమోదు



లకన్ బూమ్‌జి(ఫైల్)

భువనగిరి రూరల్, ఆగస్టు 21: అసోం రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అసోం రాష్ట్రం సోనిటీపూర్ జిల్లా బిశ్వనాథ్ చార్లీ మండలం జాబ్ బౌరి గ్రామానికి చెందిన లకన్ బూమ్‌జి(22) ఆరు నెలల క్రితం భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం శివారులోని రాజశ్రీ ఎంటర్ ప్రైజెస్ ఎక్స్‌ప్లోజివ్ గోదాం కంపెనీలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే ఓ గదిలో రూమ్‌లో నివాసముంటున్నాడు. అతనితో పాటు అతని బాబాయ్ బూమ్‌జీ కార్తీక్‌తో ఆరు నెలలుగా ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని బాబాయ్‌కి చెప్పి వెళ్లాడు. బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. అతని సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉంది. చుట్టు పక్కల వెతికినా కన్పించకపోవడంతో బుధవారం అతని బాబాయ్ కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

గంజాయి తాగుతూ పోలీసులకు చిక్కి..

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 21: ఏడాది కాలంగా గంజాయి మత్తుకు వ్యసనపరులైన ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పోలీసులకు బుధవారం చిక్కారు. ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం ముక్తాపూర్ గ్రామానికి చెందిన రమావత్ భానుప్రకాష్(19), ముద్దం బాలమల్లేశం(19), గోదాసు రాజు (19) గత ఏడాదిగా గంజాయికి బానిసలయ్యారు. వీరు హైదరాబాద్‌లోని దూల్‌పేట వద్ద గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తెచ్చుకుని నిత్యం గ్రామంలోని పాతబడిన ఇంట్లో రాత్రి సమయంలో గంజాయి సేవిస్తున్నారు. అయితే సమాచారం అందుకున్న

భూదాన్‌పోచంపల్లి పోలీసులు బుధవారం ముక్తాపూర్ గ్రామంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పోలీసులు 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నిందితులు ముగ్గురు 8వ తరగతి వరకు క్లాస్‌మేట్లు. వీరు స్నేహితులుగా మారడంతోపాటు గంజాయికి బానిసలయ్యారు. వీరు రోజువారీ కూలీలుగా అక్కడక్కడా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య

భువనగిరి టౌన్, సూర్యాపేటక్రైం, డిండి, ఆగస్టు 21: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని పోలీస్‌క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టేబుల్ భార్య, భువనగిరి పట్టణానికి చెందిన వంట కార్మికుడు, సూర్యాపేటలో వృద్ధుడు, నల్లగొండ జిల్లా డిండి మండలంలో యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్సపొందుతూ మృతిచెందాడు.

పోలీస్‌క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టేబుల్ భార్య



విజయలక్ష్మి(ఫైల్)

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామానికి చెందిన చెందిన మెట్టు మధుసూదన్‌రెడ్డి భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. 18సంవత్సరాల క్రితం వివాహంకాగా, వారికి సంతానం కలగలేదు. దీంతో మొదటి భార్య అంగీకారం, బంధువుల నిర్ణయంతో రామన్నపేట మండలం నీర్నెంల గ్రామానికి చెందిన విజయలక్ష్మి(35)ని రెండో వివాహం చేసుకున్నాడు. ఏడాది తేడాతో మొదటి భార్యకు కవలలుగా కుమారులు, రెండో భార్యకు కుమార్తె జన్మించారు. అప్పటినుంచి మొదటి భార్య పిల్లలతో 14 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటోంది. మధుసూదన్‌రెడ్డి రెండో భార్య, 15ఏళ్ల కుమార్తెతో కలిసి భువనగిరిరూరల్ పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తలెత్తిన ఆస్తి తదితర కుటుంబ వివాదాలతో కొంతకాలంగా దంపతులు, బంధువుల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. రోజువారిగానే విధులకు వెళ్లిన మధుసూదన్‌రెడ్డి బుధవారం మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వచ్చేసరికి విజయలక్ష్మి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో మధుసూదన్‌రెడ్డి కేకలు వేయడంతో క్వార్టర్స్‌లో ఉన్న పోలీస్ కుటుంబాలతో పాటు పక్కనే ఉన్న పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బంది క్వార్టర్స్‌కు చేరుకొని తలుపులను బద్దలుకొట్టి లోనికి ప్రవేశించి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతున్న విజయలక్ష్మిని కిందికి దించారు. అప్పటికే ఆమె మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో..



వేణుకుమార్‌రెడ్డి(ఫైల్)

భువనగిరి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన వంట కార్మికుడు గంగదేవి వేణుకుమార్‌రెడ్డి(42) అద్దెకు ఉంటున్న ఇంట్లో బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గంగదేవి వేణుకుమార్‌రెడ్డి, స్రవంతి సుమారు 12ఏళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. అతను హోటల్స్‌లో వంట కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొంత కాలం క్రితం సొంతంగా టిఫిన్ సెంటర్ నిర్వహించాడు. ఆర్థిక ఇబ్బందులతో భార్య, భర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. మంగళ వారం రాత్రి తీవ్రస్థాయిలో గలాటా జరగడంతో భార్య స్థానికంగానే ఉండే పుట్టింటికి వెళ్లింది. బుధవారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి వేణుకుమార్‌రెడ్డి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కారణం అంటూ అత్త, భార్య, మరదలి పేరు తాను ఉరివేసుకున్న గది గోడపై రాసాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అంత్యక్రియలకు వెళ్లిన భార్య పిల్లలను అడ్డుకోవడంతో స్వల్ప ఘర్షణ జరిగింది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

మృతదేహం పక్కన పరుగుల మందు బాటిల్



గుర్తుతెలియని వ్యక్తి

సూర్యాపేట పట్టణంలోని -65వ జాతీయ రహదారి వెంట అంజనాపురి కాలనీ సమీపంలో సద్దుల చెరువు కట్ట వద్ద సుమారు 60ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పక్కన పురుగు మందు డబ్బా లభించింది. పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీ భద్రపరిచినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ వివరాలు తెలిసిన వారు సెల్: 8712686005కు సమాచారం ఇవ్వాలని కోరారు.

యాసిడ్ ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు మృతి

నల్లగొండ జిల్లా డిండి మండలం ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన తెలకపల్లి హరికృష్ణ(26) లారీ నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం తల్లిని వేధిస్తుండేవాడు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్రూంలో ఉన్న యాసిడ్ తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు.

వేచి చూడలేక ప్రైవేటు ఆసుపత్రులకు..

- ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత
- తగ్గుతున్న కాన్పుల సంఖ్య
- శిథిలావస్థలో ఆసుపత్రి భవనం



ఓపీ సేవలకోసం హాజరైన రోగులు, నూతన భవన నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

రామన్నపేట ఆగస్టు 21: రామన్నపేట ఏరియా ఆసుపత్రిలో 24 మంది డాక్టర్లు వైద్య సేవలు అందించాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు మాత్రమే సేవలందిస్తున్నారు. ఇందులో ఒకరిద్దరు సెలవులపై వెళుతుండడంతో వైద్యం కోసం వచ్చే రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వెళ్లిన వారికి ప్రమాదకరంగా ఉందని చెబుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారని పలువురు రోగులు పేర్కొంటున్నారు. కంటి, పంటి వైద్యులు బదిలీ అయి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు సంబంధిత వైద్యులను నియమించలేదు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే రెండో అతిపెద్ద ఆసుపత్రిగా పేరుగాంచిన రామన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతం వైద్యుల కొరత వేధిస్తోంది. ఆసుపత్రి ఏర్పడి 70 సంవత్సరాలు కావస్తోంది. ప్రస్తుతం కన్నా గతమే మిన్న అనే నానుడి ఈ ఆసుపత్రికి సరిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సరిపడా డాక్టర్లు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో దూర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుత్రులను ఆశ్రయిస్తున్నారు.

శిథిలావస్థలో ఆసుపత్రి పైకప్పు

50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆసుపత్రికి రెండు, మూడు పర్యాయాలు మరమ్మతులు చేసినప్పటికీ ప్రస్తుత పైకప్పు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. దీంతో రోగులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రికి రోజుకు 400 మంది రోగులు అవుట్ పేషెంట్స్ వచ్చి వెళుతుంటారు. ఆసుపత్రిలో గతంలో నెలకు 150 కాన్పులు జరిగేవని, ప్రస్తుతం నెలకు 40 నుంచి 50 కాన్పులు మాత్రమే జరుగుతున్నాయని సమాచారం.



వేధిస్తున్న పారిశుధ్య సమస్య

పట్టణానికి చెందిన కొంపల్లి కనకయ్య అనే వ్యక్తి తన తల్లిదండ్రుల పేరిట ఆసుపత్రి భవనాన్ని నిర్మించి ప్రభుత్వానికి అప్పగించారు. ఇందులోనే ఈ ఆసుపత్రి నూతన భవనం ఏర్పాటు అయ్యే వరకు కొనసాగింది. ఇదిలా ఉండగా ఆసుపత్రి ఆవరణలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో పందులు బెడద ఉంది. అప్పుడప్పుడు విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు భయాందోళన చెందుతున్నారు. వర్షం కురిసినప్పుడు వార్డులో, ప్రధాన ద్వారం ముందు చెరువును తలపించేలా వర్షపు వరద నీరు నిలిచి దోమలకు నిలయంగా ఏర్పడుతుంది.

శంకుస్థాపనకే పరిమితమైన భవన నిర్మాణం

నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీ‌ష్‌రావు గత సంవత్సరం రూ.17కోట్లతో శంకుస్థాపన చేశారు. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.5.65కోట్ల నిధులు మంజూరు కాగా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి మిగతా నిధులు మంజూరు

క్యూలైన్‌లో రోగులు బార్లులు తీరుతున్నారు



[illegible] డాక్టర్‌కు చూపించుకోవడానికి వచ్చాను. ఓపీలో రోగులు బారులు తీరడంతో నిలబడే ఓపిక లేదు. ఆరోగ్యం సహకరించడంలేదు. సరిపడా డబ్బులు లేకున్నా ఎలాగోలా ప్రైవేట్ వైద్యుడి వద్దకే వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

-పోలాసు అంజమ్మ, ఇస్కిల్ల, రామన్నపేట మండలం

వెంటనే డాక్టర్లను నియమించాలి



రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం వెంటనే నిపుణులైన డాక్టర్లను నియమించాలి. 80 గ్రామాలకు కూడలి కేంద్రమైన ఈ ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచాలి. జిల్లాకు మంజూరు కాబోయే మెడికల్ కళాశాలను అన్ని వసతులు ఉన్న రామన్నపేటలో ఏర్పాటు చేయాలి.

-మందడి శ్రీనివా‌స్‌రెడ్డి, రామన్నపేట

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతా



ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను గుర్తించి డాక్టర్ల కొరత విషయమై పలుమార్లు ఉన్నత వైద్యాధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలిపాను. ఆసుపత్రి భవనం వర్షం కురిసినప్పుడు భవనం కురుస్తుందని పై పెచ్చులు ఊడి పడుతున్నాయని అధికారులకు తెలియజేశాం. సరిపడు డాక్టర్లు లేరు.

-డాక్టర్ వీరన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్, రామన్నపేట

రుణమాఫీ దరఖాస్తులను గ్రామాల్లో స్వీకరించాలి



రామన్నపేట ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

రామన్నపేట, ఆగస్టు 21: రుణమాఫీ కాని రైతుల సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, దరఖాస్తులను మండల కేంద్రంలో కాకుండా గ్రామాల్లో స్వీకరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జెల్లల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు గన్నెబోయిన విజయభాస్కర్, బోయిని ఆనంద్, కల్లూరి నగేష్, బల్గూరి అంజయ్య, కందుల హనుమంతు, బావండ్లపల్లి బాలరాజు, ఎండి రషీద్, గోరిగె సోములు, గోగు లింగ య్య, స్వామి, కొమ్ము, అంజయ్య, కాటమయ్య, తాడూరి కృష్ణ, మత్స్యగిరి పాల్గొన్నారు.

తుర్కపల్లి: ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరి రునమాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో రైతులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నాయకులు గుంటిపల్లి సత్తయ్య, వల్లపు బగవంతు, బొట్టు భూమయ్య, గుగులోతు పకీరా, రైతులు పాల్గొన్నారు.

గూడూరు నారాయణరెడ్డికి సన్మానం



గూడూరును సన్మానిస్తున్న బండి సంజయ్

యాదాద్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన అమర వీరుల త్యాగాలపై సినిమా తీసినందుకు నిర్మాత గూడూరు నారాయణరెడ్డిని బుధవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సన్మానించారు. సికింద్రాబాద్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 21: నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను బుధవారం కలిసి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి నుంచి జూలూరు గ్రామం వరకు రోడ్డుకు నిధులు కేటాయించాలని, పిలాయిపల్లి కాల్వ కోసం అధిక నిధులు మంజూరు చేయించాలని కోరారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణంతోపాటు పంచాయతీరాజ్ రోడ్లన్నీటికి మెయింటెనెన్స్ నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట భూదాన్‌పోచంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్ ఉన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అమరేందర్

భువనగిరి టౌన్, ఆగస్టు 21: తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని ఆర్డీవో, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ చైర్మన్ పి అమరేందర్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికారసంస్థ, జిల్లా సంక్షేమశాఖ, సీనియర్ సిటిజన్స్ సంయుక్తంగామ బుధవారం భువనగిరిలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. పోషణ బాధ్యతను విస్మరించిన పిల్లలపై తల్లిదండ్రులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి న్యాయం పొందాలన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు పిల్లలు ప్రేమ, వాత్సల్యాలు అందిస్తే మనశ్శాంతిగా ఉంటారన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం వృద్ధాశ్రమాలు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అక్టోబర్ 1 నుంచి వారం పాటు వయోవృద్ధుల సంక్షేమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినున్నట్లు తెలిపారు. సదస్సులో జిల్లా సంక్షేమ అధికారి ఎస్‌శైలజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.హరినాథ్ వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



పగిడిపల్లిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

భువనగిరి రూరల్, ఆగస్టు 21: మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని జిల్లా మహిళ సాధికారిత బృందం స్పెషలిస్టు ఫైనాన్సియల్ లిటరసీ మేనేజర్ మనీష అన్నారు. బుధవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వయో వృద్ధ శాఖ భువనగిరి ప్రాజెక్టు బొల్లేపల్లి సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉమెన్, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 181, 1098 ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. బేటి బచావో, బేటి పడావో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారిత కోఆర్డినేటర్ కుమారి, హర్ష, భార్గవి, నిఖిత, సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన

రామన్నపేట, ఆగస్టు 21: వృద్ధులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ప్రదీప్, అదనపు జూనియర్ సివిల్ ఎస్ చందన అన్నారు. కోర్టు ఆవరణలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషించని పిల్లలపై సీనియర్ సిటిజన్ యాక్ట్ కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం వృద్ధులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ వై.కృష్ణారెడ్డి, దుశ్చర్ల నరేంద్ర రావు, బార్ ప్రెసిడెంట్ ఎండీ మజీద్, లాయర్లు మామిడి వెంకటరెడ్డి, సత్తయ్య, డేవిడ్, జినుకల ప్రభాకర్, మొగులయ్య, గంగాభవాని, శివరాజు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న సీఎం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీత

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 21: ఎన్నికల సమయంలో రైతులందరికీ రూ.రెండు లక్షలు రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి, పూర్తిగా రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినప్పటికీ ఇప్పటి వరకు రైతులను ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకులో వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం రైతులందరికీ బేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతాంగానికి రైతు బంధు, విడుదల చేసి ఆదుకున్నారని, ప్రస్తుత ప్రభుత్వం కేవలం 50శాతం వరకే నిధులను విడుదల చేసి రైతులను మోసం చేసిందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 22న ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో 3వేల మంది రుణమాఫీ కాని రైతులు మహాధర్నా నిర్వహిస్తున్నామని, ధర్నాకు ఆర్థిక శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీ‌ష్‌రావు, శ్రీనివాస్‌తో పాటు 10మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని, ముందుగా లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని ధర్నాకు వెళ్లనున్నట్లు వారు వివరించారు. ధర్నా కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, టీఆర్ఎస్ పట్టణ సెక్రటరి జనరల్ పి.నరహరి, నాయకులు వెంకట్‌రెడ్డి, నాగరాజు, మారెడ్డి కొండల్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

ఆయుర్వేద పీజీ విద్యార్థికి రూ.లక్ష గ్రాంట్



కార్తికేయ

భువనగిరి టౌన్, ఆగస్టు 21: శస్త్ర చికిత్స లేకుండా వెన్నునొప్పి (సయాటికా)ని తగ్గించడంపై పరిశోధన చేస్తున్న భువనగిరికి చెందిన ఆయుర్వేద పీజీ విద్యార్థి పోలా కార్తికేయకు రూ.లక్ష గ్రాంట్ లభించింది. డాక్టర్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో పీజీ చేస్తున్న ఆయనకు పరిశోధన నిమిత్తం పీజీ స్టార్ ప్రోగ్రాంలో భాగంగా ఆయుష్ మంత్రిత్వశాఖ రూ.లక్ష గ్రాంట్‌ను మంజూరు చేసింది. గ్రాంట్‌కోసం దేశవ్యాప్తంగా 1,769 దరఖాస్తులు రాగా, తెలంగాణనుంచి కార్తికేయకు మాత్రమే రూ.లక్ష గ్రాంట్ లభించడం విశేషం. కాగా ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, హెచ్‌వోడీ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఎస్.బాబురావు పర్యవేక్షణలో పరిశోధన చేస్తున్నారు. అయితే కార్తికేయ తండ్రి పోలా శ్రీనివాస్ గుప్తా స్థానికంగా కిరాన దుకాణం నిర్వహిస్తున్నారు.

మండలానికి సాగు నీరు అందించాలి



ధర్నా నిర్వహిస్తున్న రైతులు

గుండాల, ఆగస్టు 21: మండలంలో అసంపూర్తిగా ఉన్న దేవాదుల కాల్వ పనులను పూర్తి చేసి, మండలానికి సాగు నీరు అందివ్వాలని కోరుతూ బుధవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం డీటీ నీలిమాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు, జిల్లా కార్యదర్శి కొల్లూరి రాజయ్యలు మాట్లాడుతూ దేవాదుల కాల్వ పనులు ప్రారంభించి 15 సంవత్సరాలు అవుతున్నా నేటికీ పూర్తి కాలేదని, ఉన్న కాల్వలు కూడా కంప చెట్లు, పిచ్చి మొక్కలతో పాటు పూడిక పడిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు హరిశ్చంద్ర, మండల కార్యదర్శి రామచంద్రయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, ఉప్పుల కొమురయ్య, పోతరబోయిన సత్యనారాయణ, అంజయ్య, నర్సయ్య, బాలయ్య పాల్గొన్నారు.

వయ్యారిభామతో పంటలకు నష్టం



వయ్యారిభామ మొక్కలతో కలిగే అనర్థాలను వివరిస్తున్న బి.అనిల్‌కుమార్

భువనగిరి రూరల్, ఆగస్టు 21: వయ్యారిభామ కలుపు మొక్కలతో పంటలకు తీవ్ర నష్టం కలుగుతుందని ఏరువాక కేంద్రం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త అనిల్‌కుమార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో పార్థీనియం అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం భువనగిరి మండలం అనాజీపురం, బొల్లేపల్లి, కూనూరు, ముత్తిరెడ్డి గూడెం, మోటకొండూరు గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతులకు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వయ్యారిభామ కలుపు మొక్క ప్రభావం 40 శాతం దిగుబడి నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఈ మొక్కలతో మనుషులకు కూడా ఆస్తమా, ఎలర్జీ తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వివరించి, ఆయా గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో, పాఠశాల ఆవరణలో పెరిగిన మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీశైలం పాల్గొన్నారు.

విడువని వర్షం

భువనగిరి టౌన్, ఆగస్టు 21: భువనగిరిలో మూడు రోజులుగా కురిసిన వర్షం బుధవారం రోజంతా తెరిపినిచ్చింది. మధ్యాహ్నం ఉక్కపోత ఇబ్బందులు కూడా ఎదురయ్యాయి. కానీ రాత్రి మళ్లీ ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పోయిందనుకున్న వర్షం కురిసింది. వర్షం రావడం చల్లటి చిరు గాలులు వీయడంతో ప్రజలకు ఉక్కపోత నుంచి మరోమారు ఉపశమనం లభించింది.

మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి



పోచంపల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 20: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టాలని, కలకత్తాలో జూనియర్ డాక్టర్‌ను హ్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీవైఎల్ పట్టణ కార్యదర్శి పగడాల శివ డిమాండ్ చేశారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్ కాలేజీలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనాయని అన్నారు. కలకత్తా నగరంలో ట్రైనీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళపై దుండగులు కలిసి విచక్షణ రహితంగా దాడి చేసి అత్యాచారం చేసి చంపేయడం దారుణమైన విషయమన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్.నరేష్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు రాము, లాలు, కరుణాకర్, పీడీఎస్‌యూ విద్యార్థులు భావన, త్రిష, జ్యోతి, శ్రీచందన, అక్షయ, అస్మిత, వైష్ణవి, శివాని, వర్ధిని, మనీషా, పీవైఎల్ పట్టణ నాయకులు పోతగల్ల నరసింహ, లక్ష్మీనారాయణ, దేవేందర్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : శాస్త్రీయా విద్యావిధానం కోసం విద్యార్థులు ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పంగా రవి అన్నారు. బుధవారం ఆలేరులో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు ప్రవణ్, కరుణాకర్, సూర్యం, ప్రశాంత్, శివ, సుధీర్, కల్పన ఉన్నారు.

తూతూ మంత్రంగానే ఉద్యోగుల బదిలీలు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 21: యాదగిరిగుట్ట దేవస్థానంలో ఇటీవల ఉద్యోగుల బదిలీలు తూతూ మంత్రంగానే చేశారని బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుడు ప్రవీణ్, గుంటిపల్లి సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం గుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాటాడారు. గుట్ట దేవస్థానం ఈఈ రామారావును తాత్కాలికంగా సస్పెండ్ చేసినా ఆయనపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. అవినీతి అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నరేశ్, నవీన్, దొమ్మాట నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు లక్ష విరాళం

చౌటుప్పల్ టౌన్ , ఆగస్టు 21: చౌటుప్పల్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం పూర్వ విద్యార్థిని అక్షయకు ఇంటర్మీడియట్ విద్య కోసం స్థానిక పాలకుర్ల శివయ్య ఫౌండేషన్ చైర్మన్ మురళి బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయాలి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 21: మండలంలో ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. స్థానిక కందాళ రంగారెడ్డి భవన్ లో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నర్సింహ మాట్లాడారు. నాయకులు బొజ్జ బాలయ్య, బోయ యాదయ్య, సాలయ్య పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి, పీవీ విగ్రహాలు ఏర్పాటు చేయాలి

మోత్కూరు, ఆగస్టు 21: సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి, దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విగ్రహాలను ఏర్పాటు చేయాలని మోత్కూరు మాజీ మార్కెట్ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు

కరాటే పోటీల్లో 'బ్రిలియంట్' విద్యార్థుల ప్రతిభ

భువనగిరి టౌన్, ఆగస్టు 21: ఇటీవల భువనగిరిలో జరిగిన జాతీయస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో స్థానిక బ్రిలియంట్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. వేరువేరు విభాగాలలో రెండేసి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నక్క కృష్ణయ్య, కోచ్ జె సందీప్ పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో భారత్ బంద్

అడ్డగూడూరు, ఆగస్టు 21: ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో భారత్ భారత్ బంద్ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాయకులు అరుణ్ కుమార్, కమాలాకర్, నిఖిల్, ప్రవీణ్, ప్రశాంత్, బన్ని, ప్రేమ్ ఉన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఆలేరు రూరల్, ఆగస్టు 21: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని బుధవారం ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎదుట అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు మొగులగాని కాటమయ్య, రొయ్యాల నర్సింగరావు, రాజు, స్వరూప, చంద్రయ్య, హరి, పవన్ ఉన్నారు.

ద్విచక్రవాహనం అపహరణ

భువనగిరి రూరల్, ఆగస్టు 21: భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయిగిరిలో మచ్చ అనిల్‌కు చెందిన హీరో హోండా ఫ్యాషన్ ప్లస్ బైకు అపహరణకు గురైంది. మచ్చ అనిల్ రోజు వారి మాదిరిగా తన ఇంటి ముందు బైకును పార్కింగ్‌చేసి ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఆ బైకును బుధవారం తెల్లవారు జామున లేచి చూడగా ఆ బైకు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లినట్లు గుర్తించాడు. అయితే సమీపంలోని ఓ వ్యక్తి బైకులోంచి పెట్రోల్ తీసి అపహరణకు గురైన బైకులో పోసుకుని పరార్ అయ్యారని బాధితుడు మచ్చ అనిల్ తెలిపారు.

'వీఆర్‌వో వ్యవస్థను పునరుద్ధరించాలి'

మోత్కూరు, ఆగస్టు 21: కొన్ని చేర్పులు, మార్పులు చేసి పటిష్టంగా పని చేసేలా వీఆర్‌వో వ్యవస్థను పునరుద్ధరించాలని దత్తప్పగూడెం మాజీ ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణాచారి కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భూస్వాముల ప్రయోజనాల కోసం రూపొందించిన ధరణి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత చట్టాన్ని తీసుకరానున్న నేపథ్యంలో ఆర్ఓఆర్-2024 పేరిట ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకోవడం హర్షనీయమన్నారు. ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న నేపథ్యంలో తన అభిప్రాయాలను ఆయన బుధవారం విలేకరులకు వెల్లడించారు. తన అభిప్రాయాలను సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో ప్రభుత్వానికి పంపుతానన్నారు. రైతులు, మేధావులు తమ సలహాలు, సూచనలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీ.సీ.ఎల్.ఏ.తెలంగాణ జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌కు పంపి రైతుల భూ రికార్డుల భద్రతకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడ్పాటునందించాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భువనగిరి టౌన్, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు, తెలంగాణలో వర్గీకరణ చట్టాన్ని వెంటనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం భువనగిరిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు విద్యా, ఉద్యోగ రంగాలలో న్యాయం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జ్ కూరెళ్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు బూసి మహేష్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు బైరపాక నాగరాజు, బాలముల పరుశరాములు, కొంపెల్లి వెంకట్, వడ్డేపల్లి యాదయ్య, బొట్ల సురేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత మేళవించేలా ఉత్సవాలు



శ్రీశైలం

భువనగిరి టౌన్, ఆగస్టు 21: ఆధ్యాత్మిక మేళవించేలా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని భువనగిరి గణేష్ ఉత్సవ సమితి పిలుపునిచ్చింది. భువనగిరిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో బుధవారం ఉత్సవసమితి నవరాత్రి వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ వచ్చే నెల 7 నుంచి 16 వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి నూతన అధ్యక్షుడిగా రత్నపురం శ్రీశైలంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ సమితి ప్రతినిధులు సుర్వి శ్రీనివాస్, పట్నం కపిల్, పూస శ్రీనివాస్, కాలేరు లక్ష్మణ్, మెరుగు మధు, ఆకుల మహేందర్, కానుకుంట్ల రమేష్, గణేష్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.